శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## అంగరంగ వైభవంగా మహాకుంభాభిషేకం ప్రారంభం



**బుచ్చి ఏప్రిల్ 27 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి ఆలయంలో మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా ప్రారంభం అయింది. తొలుత రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కొలన్ రాజారెడ్డి,పూజితమ్మ దంపతులు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలకు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు,పాలక మండలి సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కంచి పీఠం నుండి వచ్చిన పండితులచే గణపతి హోమం,గోపూజ అత్యంత భక్తి శ్రద్దల నడుమ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు కంచిపీఠాదిపతులు సరస్వతి ఆనంద్ ఆశీర్వాదాలతో మహా కుంభాభిషేకాన్ని 15 సంవత్సరాల తరువాత జరుపుతున్నామని తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమానికి వేలది మంది భక్తులు విచ్చేసి స్వామి అమ్మవారిని దర్శించుకొని తరించాలని ఆయన కోరారు. దాతలు కేశవరెడ్డి,కామాక్షమ్మ, దంపతులు అమ్మవారికి 16 లక్షల విలువగల హారాన్ని సమర్పించారు.ఈనెల 30 వ తేదిన కంచి పీఠాదిపతి విజయేంద్ర సరస్వతీ స్వామి విచ్చేసి మూడు రోజులుపాటు దేవస్థానంలోనే బసచేసి మహాకుంబాభిషేకం కార్యక్రమాని ఆయన చేతుల మీదుగా నిర్వహిస్తారని ఆయన తెలిపారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నెలవారి నేర సమీక్షలో ఎస్.పి



**నెల్లూరుక్రైమ్,ఏప్రిల్27, ప్రభాతవార్త:** నగరంలోని జిల్లా పోలీస్‌కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో నెలవారి నేర సమీక్షాసమావేశం జిల్లా ఎస్.పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రంక్‌అండ్‌డ్రైవ్, ఓపన్ డ్రింకింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి వాటిపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని అదికారులకు ఆదేశాలు జారీచేశారు. ఎస్.హెచ్.ఆర్.సి,ఎస్.హెచ్.ఆర్.సి, లోకాయుక్త, లోక్‌అదాలత్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు.హత్యానేరం,మహిళలపై వేధింపులు,అట్రాసిటి నేరాలపై ప్రత్యేకదృష్టి సారించి సంఘటనా స్థలాన్ని సందర్శించినపుడు ప్రాధమిక ఆదారాలు సేకరించినపుడు ముద్దాయిలకు శిక్షపడేలా చేయగలమని వివరించారు.ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్,పేకాట,మత్తుపదార్థాల అమ్మకం,రవాణాను పూర్తిగా నిర్మూలించే దిశగ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.మిస్సింగ్ కేసులు ఫోక్స్ మరియు అత్యాచారఘటనలు పెండింగ్ లోవున్న కేసులు ఎన్.బి.డబ్లు వారెంటు విషయాలు సమీక్షించి సలహాలు అందించారు.కేసు దర్యాప్తు ప్రారంభించేముందు ఆ నేరం జరగడానికి దానివెనుక వున్న మూలాలను తెలుసుకోవాలని అపుడే ఆ కేసుల్లో పురోగతి సాధిస్తామని వివరించారు.పెండింగ్ కేసుల దర్యాప్తులో ప్రతిభచూపించిన సిబ్బందికి ప్రశంశాపత్రాలు అందించారు.బదిలీపై వెళుతున్న కందుకూరు డి.ఎస్.పిని శాలువాతో సత్కరించి మెమెంటోను అందించారు.ఈసమీక్షా కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాదికారులు అన్ని సభ్‌డివిజన్‌ల పోలీస్ అదికారులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,సబ్‌ఇన్‌స్పెక్టర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సభ్యసమాజం తలదించుకునేలా మేయర్‌పై దాడి




**నెల్లూరు ఏప్రిల్ 27, ప్రభాతవార్త-వైద్యం**నెల్లూరు నగర ప్రధమపౌరురాలు అయిన ఒక ఎస్టీ మహిళ పొట్లూరి.స్రవంతిపై వైసీపీ కార్పొరేటర్లు దాడికి పాల్పడడం అతి దారుణమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి.భరత్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. గురువారం నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న జిల్లా బీజేపీ కేంద్ర కార్యాలయంలో భరత్‌కుమార్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు తాము నగర కార్పొరేషన్‌లో 54 సీట్లు గెలుచుకున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ పార్టీలోని నాయకులపైనే దాడికి పాల్పడే ధౌర్భాగ్య కార్పొరేటర్లన్నారు. రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను నిలిపేవేయాలని ఆ కార్పొరేటర్లు నేరుగా కమీషనరుకి వినతిపత్రం ఇవ్వాడని చూస్తూంటే అది ప్రజల ఉండే నియోజకవర్గం కాదేమోనని అనుమానం వస్తోందన్నారు. ఒకే పార్టీలోని వారు వారికి వారే దాడులు చేసుకుంటూ ప్రజాభివృద్ధిని ఆపేయాలనడం దుర్మార్గమన్నారు. మేయర్ స్రవంతిపై దాడి మహాభారతాన్ని తలపిస్తోందన్నారు. కార్పొరేషన్ సమావేశంలో ఒక మహిళ అని కూడా చూడకుండా నిండు సభలో ఆమె చీరను లాగేందుకు ప్రయత్నించిన కార్పొరేటర్లు మొయిళ్ళ.గౌరి, బొబ్బల.శ్రీనివాస్, మూలే.భాస్కర్‌రెడ్డిలపై తక్షణమే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే వారి కోసం ప్రత్యేకించి చట్టం చేసిన అట్రాసిటీ కేసును తిరిగి ఎస్సీ, ఎస్టీలపైనే పెట్టేందుకు జగన్ మరో చట్టాన్ని చేసినట్లుందని ఆయన విమర్శించారు. మేయర్ స్రవంతిపై దాడి చేయడం, వ్యవస్థలపై దాడి చేయడమేనని ఆయన మండిపడ్డారు. మేయర్‌పై దాడిని ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళతామని గుండ్లపల్లి వెల్లడించారు. బూతులు మాట్లాడే సంస్కృతిని తెచ్చిందే జగన్ అని ఆయన దుయ్యబట్టారు. సొంత చిన్నాన్న హత్య జరిగితే సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. సీబీఐయే మమ్మల్ని ఈ హత్యలో ఇరికించాలని చూస్తున్నారని, హత్య చేసిన వారే ఆరోపించడం విచిత్రంగా ఉందన్నారు. రాష్ట్ర, జిల్లావ్యాప్తంగా చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలపై ఒక లేఖను రాస్తామన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నిధులను సైతం తాము ప్రవేశపెట్టిన పథకాలుగా చెప్పుకుంటూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. వీటన్నింటినీ త్వరలో కేంద్రానికి తెలియచేస్తామన్నారు. ఈ నెలాఖరున ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనస్సులోని మాట మన్‌కీబాత్ కార్యక్రమంలో కోట్లానుమంది ప్రజలు పాల్గొననున్నారని భరత్ తెలిపారు. ఆదివారం 11గంటలకు హిందీలో తెలుగు ప్రజల కోసం 11గంటల 30నిమిషాలకు తెలుగులో ప్రసారం కానుందని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు తిలకించాలని ఆయన కోరారు. చిరు వృత్తుల వారి గొప్పతనాన్ని కూడా ఈ కార్యక్రమంలో తెలియచేయడం జరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు కిసాన్ మోర్చా కాలం.బుజ్జిరెడ్డి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు పోట్లూరి.శ్రీనివాసులు, గుత్తా.అశోక్‌నాయుడు, ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిబట్టె.శ్రీనివాసులు, సాయికృష్ణ, మూర్తి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల సిబ్బంది పనితీరుపై ఆర్‌డిఒ ఆగ్రహం



**జలదంకి,ఏప్రేల్27,ప్రభాతవార్త:** జలదంకిలో సచివాలయాల పనితీరు అద్వానంగా ఉందని కావలి ఆర్.డి.ఒ శీనానాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఆయన గ్రామ ఒకటి,రెండు సచివాలయాలను తనిఖీచేశారు.ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరు సక్రమంగా లేని విదంపై ప్రశ్నించారు.సంక్షేమ పదకాలు వివరాల బోర్డులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.కార్యాలయాల ఆవరణాలు అపరిశుభ్రం నెలకొని వుండడంపై పెదవివిరిచారు. మీ ముంగిటే ఇలావుంటే ఇక గ్రామాలను ఎలా తీర్చిదిద్దుతారో ఊహించుకోవచ్చని అన్నారు.ఆదార్ ఆప్‌డేట్,ఆయుష్‌మాన్‌భారత్ తదితరాలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలకు వచ్చానని మేఒకటవ తేదీకల్లా అన్నీ సరిచేసుకోకపోతే చర్యలు తప్పవని ఆర్.డి.ఒ హెచ్చరించారు.అంతకుముందు ఆయన తహసిల్‌దార్ కార్యాలయాన్ని తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు.రీసర్వేపనులు,గ్రీవెన్సు అర్జీల పరిష్కారం వంటి వాటిలో ఎప్పటికప్పుడు చురుగ్గా వుండాలని సూచించారు.ఆయనవెంట తహసిల్‌దార్ పద్మావతి,ఎం.పి.డి.ఒ శ్రీధర్‌లు వున్నారు.

## రెండవ రోజు సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

**కందుకూరు,ఏప్రిల్27,ప్రభాతవార్త** కందుకూరు సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రెండవ రోజు కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.రికార్డులు పరిశీలించారు.బుధవారం రోజు మొదలైన ఈ తనిఖీలు గురువారంకూడా కొనసాగాయి.ఈ సందర్భంగా సెలవుపై ఉన్న సబ్‌రిజిస్టార్‌ను పిలిపించి ఆరా తీశారు.ఆయనతో మాట్లాడారు.సిబ్బందితో విడివిడిగా విచారించారు.చిక్కిన నగదు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం సబ్‌రిజిస్టార్ సుల్తాన్‌ను అదుపులోకి తీసుకుని నెల్లూరు తరలించారు.

# యువత స్వశక్తితో రాణించాలి



**వెంకటాచలం ఏప్రిల్ 27 ప్రభాతవార్త** యువతి యువకులు స్వయం కృషితో రాణించి సొంత కాళ్లపై తాము నిలబడేలా అలోచనలు చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు పిలుపు నిచ్చారు.వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రాంగణంలో ముప్పవరపు పౌండేషన్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ఉపాది కోర్సులలో శిక్షణ పొందుతున్న యువతి యువకులతో గురువారం ప్రత్యేక సమావేశము నిర్వహించారు.వెంకయ్యానాయుడు మాట్లడుతూ విద్యార్ధి దశ నుంచి కన్న తల్లి దండ్రులను,మాతృభూమిని మాతృభాషను దేశాన్ని గౌరవించడం అలవరుకోవలన్నారు.చదువును నిర్లక్ష్యం చేసి మద్యలోనే చదువు వదిలివేయడం సరైనదికాదన్నారు.తల్లి దండ్రులు పిల్లలను ఉన్నత చదువుల వైపు చదివించే దశగా అలోచనలు చేయలన్నారు. యువతి యువకులు తమ ఎంచుకున్న రంగాలు వైపు నైపుణ్యత సాదించాలని సూచించారు.వృతి నైపుణ్యత అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలియజేశారు.కేవలం ప్రభుత్వాలు మాత్రమే అందరికి ఉగ్యోగ అవకాశాలు కల్పించలేవని స్వచ్ఛంద సంస్థలు సంపన్నులు ముందుకు వచ్చి నిరుద్యోగులకు వివిద రకాలు ఉపాది కోర్సులు శిక్షణ నివ్వాల్సిన అవసరం ఉందిన్నారు.ముప్పవరపు పౌండేషన్ ఆద్వర్యంలో గత కొన్నెళ్లగా యువతి యువకులకు ఉపాది కోర్సులు శిక్షణ ఇవ్వడం అబీనందనీయమన్నారు.శిక్షణ పొందుతున్న యువతి యువకులు క్రమశిక్షణ అశక్తితో నేర్చుకొని జీవితంతో తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు.పాశ్చత్తా యామోహంలో పడి యువత చెడువాసనాలకు బానిసకావద్దు అన్నారు.భారత దేశం భవిష్యత్ యువత చేతుల్లో ఉందిని విషయం మర్చిపోరాదని భారత దేశం శక్తి వంతమైన దేశంగా నిర్మించడంతో తమ వంతు పాత్ర పోషించాలని పిలువునిచ్చారు.ఇతర భాషలు నేర్చుకోవడం అవసరమేనని కానీ తెలుగును నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.చదువుతోపాటు ఆర్యోగంపై ప్రత్యేక శ్రద్ద చూపాలని పేర్కొన్నారు.వ్యాయామం మంచి ఆహారపు అలవాట్లుతో ఆరోగ్యంగా జీవిస్తామని విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుచుకోవాలన్నారు.ఈ సమావేశములో ముప్పవరపు పౌండేషన్ చెర్మన్ హర్షవర్ధన్ సైరడ్ డైరక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# నేలటూరులో మంత్రికి ఘనస్వాగతం



**ముత్తుకూరు,ఏప్రిల్27,ప్రభాతవార్త** రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నేలటూరు గ్రామస్తులు గురువాం ఘనంగా స్వాగతం పలికారు.నేలటూరు అర్జునవాడలో వాటర్‌ప్లాంట్‌ను ఏడు లక్షల వ్యయంతో ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పనులు జరుగుతున్నాయని అదికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలనకు ప్రజలందరూ బ్రహ్మరథం పడుతున్నారన్నారు.ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.భూములు కోల్పోయిన కుటుంబాలకు సంబంధించి వారి బిడ్డలుక ఉదో య్గాలు కల్పిస్తున్నామన్నారు.ఇప్పటికే 200మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు.సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమాన్ని పరుగులు పెట్టడం జరిగిందన్నారు.గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు.లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడంలో ఎటువంటి రాజీ పడకుండా అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి,ఈపూరు కోటారెడ్డి,ఈపూరు గిరిధర్‌రెడ్డి,సర్పంచ్ కనకయ్య,విజిల్‌రెడ్డి,రామ్మోహన్‌రెడ్డి,శేషారెడ్డి,పంట పాలెంసర్పంచ్ ఆలపాక సీనయ్య,ఉపసర్పంచ్ బ్రహ్మానందం,కోఆప్షన్ సభ్యులు జమీలు,అగ్ని తదితరులు పాల్గొన్నారు.

## నందవరం మోడల్ స్కూలో వార్డెన్‌పై తూతూమంత్రంగా విచారణ



**మర్రిపాడు, ఏప్రిల్27ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్లో వసతిగృహవార్డెన్ వ్యవహారంపై గురువారం విచారణ జరిపారు. జిల్లా సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఇ.ఉషారాణి , నెల్లూరు డైట్ ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వర్లు తో కూడిన అధికార బృందం విచారణ జరిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి మరో రెండురోజుల్లో ముగియనున్న నేపథ్యంలో అధికారులు తూతూ మంత్రంగా ఈ విచారణ జరపడం పట్ల విద్యాలయంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. నందవరం మోడల్ స్కూల్ వసతిగృహంలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని తాను ఉంటున్న గదిలో బయటి వ్యక్తితో ఉండడంతో విద్యార్థులు సమాచారం అందించడంతో మర్రిపాడు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. డిసెంబరు 7న ఈ సంఘటన జరిగింది. సంఘటన జరిగిన నెల రోజుల తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారులు కావలి డిప్యూటీ డిఇఒ సారథ్యంలో విచారణ జరిపారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో విద్యాలయంలో పనిచేసే ఉపాధ్యాయినిలు డ్యూటీలు వేసుకొని హాస్టల్ వార్డెన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల 10వతరగతి, ఇంటర్ పరిక్షలు పూర్తికావడంతో వందల సంఖ్యలో ఉన్న విద్యార్థులు ఇళ్ళకు వెళ్ళిపోయారు. ప్రస్తుతం 8,9 తరగతి చదువుతున్న 9మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఔట్‌సోర్సింగ్ విద్యార్థిని డిసెంబర్ 7నుంచి విధులకు దూరంగా ఉండడం ఆమె స్థానంలో తాత్కాలికంగా వార్డెన్‌ను ఎంపిక చేయడంలో తీవ్ర జాప్యం చేసినా సంబంధిత జిల్లా అధికారుల తీరుపై విద్యాలయ తల్లిదండ్రుల కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర స్థాయిలో నిరసనలు, ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం ఉషారాణి నేతృత్వంలోని అధికారుల బృందం తూతూ మంత్రంగా విచారణ జరపడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా నిరసనలు, ఆ ందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ మోడల్‌స్కూల్స్, వసతిగృహాలపై ఒకటిరెండు రోజుల్లో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నందున అధికారులు ఈ తూతూ మంత్ర విచారణ సాగించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఒక కాంట్రాక్ట్ ఉద్యోగినికి జిల్లా అధికారులు వత్తాసుపలుకుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ తక్షణమే సమగ్ర దర్యాప్తుకు ఆదేశించి , విద్యాసంవత్సరం ప్రారంభంలోనైనా కొత్త వార్డెన్‌ను నియమించాలని విద్యాలయ తల్లిదండ్రుల కమిటీ సభ్యులు , విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.

## 30 నుండి వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలు



**నెల్లూరు, ఏప్రిల్27, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలో వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఏప్రిల్ 30వ తేదీ నుంచి మొదలు కానున్న వార్షిక బ్రహోత్సవాలు సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి,కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేసి బ్రహోత్సవాలకు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు శ్రీ పామూరు మల్లికార్జునరెడ్డి,ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

## డాక్టర్ దొరసానమ్మ ఇకలేరు




**ఆత్మకూరు,ఏప్రిల్27ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని శ్రీవెంకటేశ్వరా ప్రజా వైద్యశాలకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ వింజం దొరసానమ్మ(62) గురువారం మృతిచెందారు. ఆమె స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో గత 3దశాబ్దాలుగా ప్రముఖ ప్రజా వైద్యురాలిగా ఆమె విశిష్ట సేవలందించారు. ఆత్మకూరు, బద్వేల్‌తదితర పరిసర ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో శ్రీవెంకటేశ్వర ప్రజా వైద్యశాలకు తరలివచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. దొరసానమ్మవద్దకు వచ్చిన మహిళలను ఆప్యాయంగా ప్రేమానురాగాలతో యోగ క్షేమాలు అడిగి వైద్యసేవలు అందించేవారు.అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్యాన్ని అందించారు .ఆమె మృతిపట్ల మహిళాలోకం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**పలువురి సంతాపం**

డాక్టర్ దొరసానమ్మ మృతి సమాచారం తెలుసుకొని పలువురు నేతలు దొరసానమ్మ ఇంటికి తరలి వచ్చారు. ఆమె పార్థివ దేహానికి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులైన ఆమె భర్త వెంకటేశ్వరరావ్‌ను, ఆమె కుమార్తె డాక్టర్ హారిక, అల్లుడు డాక్టర్ ప్రణీత్‌లను ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి , నెల్లూరు కిమ్స్ హాస్పెటల్ ఇడి గిరినాయుడు, ఆత్మకూరు మాజీ జడ్పీటిసి సభ్యులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, ఆత్మకూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆత్మకూరు మార్కెట్‌కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రా వెంకటసుబ్బానాయుడు, జిల్లా తెలుగుయువత నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు నివాళులర్పించారు.

## ప్యాసింజర్ రైళ్ల స్టాపింగ్ రద్దుపై పెల్లుబికుతున్న నిరసనలు

**బిట్రగుంట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని జిల్లాలో గల శ్రీ వెంకటేశ్వరపాళెం, తలమంచి, అల్లూరురోడ్డు రైల్వే స్టేషన్‌లలో మే 1వ తేది నుండి పలు ప్యాసింజర్ రైళ్ళ స్టాపింగ్‌ను రద్దు చేస్తూ రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కరోనా కారణంగా ఈ రైల్వే స్టేషన్‌లలో పలు ప్యాసింజర్ రైళ్లను నిలుపుదల చేసి ఆ తదుపరి రైల్వే శాఖ పునరుద్దరించిందని ప్రయాణికులు సంతోషించే లోపలే టికెట్ల విక్రయం తక్కువగా వుందన్న సాకుతో మే 1 నుండి శ్రీ వెంకటేశ్వరపాళెం రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం నిలిచే విజయవాడ-బిట్రగుంట, బిట్రగుంట-విజయవాడ, విజయవాడ-గూడూరు, గూడూరు-విజయవాడ మధ్య నడిచే రైళ్ళకు స్టాపింగ్‌ను ఎత్తివేయనున్నారు. అల్లూరురోడ్డులో విజయవాడ-గూడూరు, గూడూరు-విజయవాడ రైళ్లను, తలమంచి రైల్వే స్టేషన్‌లో విజయవాడ-గూడూరు, గూడూరు-విజయవాడ, గూడూరు-బిట్రగుంట మధ్య నడిచే రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంటలో వున్న శ్రీ వెంకటేశ్వరపాళెం రైల్వే స్టేషన్‌లో రైళ్ళ స్టాపింగ్ ఎత్తివేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ప్రతి శనివారం సుదూర ప్రాంతాల నుండి భక్తులు ఈ రైల్వే స్టేషన్‌కు చేరుకొని శ్రీ స్వామి వారిని దర్శిస్తుంటారు. అలాగే అల్లూరురోడ్డు, తలమంచి రైల్వే స్టేషన్‌లలో ఉత్తరాంధ్ర నుండి వందలాది మంది వలస కూలీలు ఉపాధి కోసం వస్తుంటారు. తలమంచి, అల్లూరురోడ్డు రైల్వే స్టేషన్ ప్రాంతాలలో పలు పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి కోసం వచ్చేవారు రోజు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆదాయం తక్కువగా వుందని రైళ్లను ఆయా స్టేషన్‌లలో నిలుపుదల ఎత్తివేస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని వీరు జీర్ణించుకోలేపోతున్నారు. దీనిపై పార్లమెంటు సభ్యులు దృష్టి సారించి ఈ రైళ్లను యధావిధిగా ఆయా స్టేషన్‌లలో నిలుపుదల చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశం



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్27,ప్రభాతవార్త** జగనన్న కాలనీ లేఅవుట్లోని నిర్మాణ పనులు వేగవంతం చేసి గృహాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందించాలని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు.కార్పొరేషన్‌లోని కమిషనర్ ఛాంబర్ హౌసింగ్ కార్పొరేషన్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్దేశించిన యాక్షన్ ప్లానును అధికారులంతా పటిష్టంగా అమలు చేస్తే లక్ష్యాలను సాధించగలమని తెలిపారు.మెప్మా విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ,లబ్ధిదారుల రుణాల మంజూరు ప్రక్రియకు ప్రత్యేక మేళాలు నిర్వహించాలని,మోడల్ గృహాల నిర్మాణాల ద్వారా లబ్ధిదారులకు స్వంత నిర్మాణాల దిశగా ప్రోత్సహించాలని సూచించారు.రుణాల మంజూరైన లబ్ధిదారుల గృహాలను వేగంగా పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

**నాణ్యత ప్రమాణాలు పాటించాలి** లబ్ధిదారుల భాగస్వామ్యంతో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న గృహాల నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులకు లేఅవుట్ల నిర్మాణ పనుల్లో లక్ష్యాలను నిర్దేశించి అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని ఆదేశించార. విద్యుత్తు,వీది దీపాలు,మంచినీరు,డ్రైన్లు,రోడ్డు మార్గాలు వంటి మౌళిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలని సూచించారు. హౌసింగ్ ఈఈ.నాగరాజు,డిఈలు శ్రీహరి గోపాల్,దయాకర్,ఏఈలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో మోపూరు శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



**అల్లూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ ఫలితాలలో అల్లూరు మండలంలోని నార్తుమోపూరులోని శ్రీ చైతన్య ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని కరస్పాండెంట్ శివకుమార్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాలలో వెయ్యి మార్కులకు గాను యం.స్నేహ 985. జి.అనిత 971, పి.పూజిత 965 మార్కులతో మొదటి. ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. 900కు పైగా మార్కులు సాధించిన మొత్తం 15 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు వున్నారని తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులకు గాను ఎస్.కె.ఖాసీఫా 457 మార్కులు, సి.హెచ్.సువర్షిక 441 మార్కులు, ఎస్.కె.సుమయ 440 మార్కులతో మొదట, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. 400 మార్కులకు పైగా 14 మంది విద్యార్థులు వున్నారని కరస్పాండెంట్ శివకుమార్ తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పి.ఖాజారంతుల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువు మీద శ్రద్ధ చూపితే ఉన్నస్దితి నుండి ఉన్నత స్దితికి



**కలువాయి ఏఫ్రిల్ 27 ప్రభాతవార్త:** విద్యార్దులు బాల్యం నుండే చదువులపై శ్రద్ద చూపితే ఉన్న స్దితి నుండి ఉన్నత స్దితికి ఎదుగుతారని మండల సచివాలయల కన్వీనర్ మాదాస్ యజ్ఞపవన్ తెలిపారు. కుల్లూరులోని జడ్‌పి హైస్కూల్ నందు170 మంది విద్యార్దిని విద్యార్దులకు పాదరక్షలు పంపిణి చేశారు. ప్రతి ఏడాది విద్యార్దిని విద్యార్దుల బాగాగోలను దృష్టిలో ఉంచుకొని వేసవి కాలంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు విద్యార్దిని విద్యార్దులకు ఎంతో ఆసరాగా ఉంటు వారి యొక్క అభ్యున్నతికి పాటుపడుతున్న గ్రామదత్తత స్వీకరణి మాదాస్ నళిని గంగాధరం,మాదాస్ గంగాధరంకు విద్యార్దిని విద్యార్దులు ఉపాధ్యాయులు,సిబ్బంది అభినందనలు తెలిపారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బిపి నరసింహులు,గ్రామ సర్పంచ్ అంకయ్య,వైస్ సర్పంచ్ శ్రీనివాసులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీశివసాయి విద్యార్దుల ప్రతిభ



**కలువాయి ఏఫ్రిల్ 27 ప్రభాతవార్త:** ఇంటర్ మీడియట్ ఫలితాలలో కలువాయిలోని శ్రీశివసాయి కళాశాల విద్యార్దులు ప్రతిభను చాటారు. బుధవారం విడుదలైన ఇంటర్ మీడియట్ ఫలితాలలో జూనియర్ ఇంటర్‌లో కె.కవిత 462 మార్కులుప్రధమస్దానంలో నిలువగా,ద్వితీయ స్దానంలో బి.అనుషా 451 మార్కులు సాధించగా ,సీనియర్ ఇంటర్‌లోఎన్ పూజిత 960 మార్కులు సాధించింది,ద్వితీయ స్దానంలో ఎన్ రేవతి 944 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది విద్యార్దులను అభినందించారు.కళాశాల ఫ్రిన్సిపల్ పి శ్రీనివాసులు,అద్యాపక,అద్యాపకేతర సిబ్బంది విద్యార్దిని విద్యార్దులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పేదల డాక్టర్ చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి




**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** డాక్టర్ చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి విద్య, వైద్య రంగాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ దాకారపు రవిప్రకాష్ తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో గురువారం గూడూరు రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు, ప్రముఖ రొటేరియన్ డాక్టర్ సి.ఆర్.రెడ్డి సంతాప సభ జరిగింది. ఈ సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఆరు దశాబ్దాలుగా జిల్లా పేద ప్రజలకు వైద్య సేవలందించారన్నారు. గూడూరులో పలు విద్యాసంస్థలకు, మహిళా కళాశాలలకు అండగా నిలిచారన్నారు. కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం వ్యవస్థాపకుడు చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డికి ఆయన సొంత తమ్ముడు అన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ డాక్టర్ బెజవాడ రవికుమార్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, ఒరుగంటి వెంకటేశ్వర్లు, బి.ఎస్.ప్రసాద్, జమున, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో స్నేహ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ




**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ఇంటర్ ఫలితాలలో కావలి పట్టణం కోఆపరేటివ్ కాలనీలోని స్నేహ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటి చెప్పారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థుల్ని కళాశాల కరస్పాండెంట్ పైనబోయిన తిరుపతి అభినందించి మాట్లాడారు. జూనియర్ ఎంపిసి విభాగంలో పఠాన్ ఆరీఫ్ 461/470, షేక్ ఖాదర్ వున్నీసా 460, జంపాని జాహ్నవి 460 మార్కులు సాధించారన్నారు. జూనియర్ సిఇసి విభాగంలో మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని తమ కళాశాల విద్యార్థిని శృతి 443/500 మార్కులు సాధించారన్నారు. 400 మార్కులు పైగా 20 మంది విద్యార్థులు విజయం సాధించారన్నారు.

## శ్రీ వేదగిరి లక్ష్మీనరిసింహస్వామి దేవస్థానం హుండీ ఆదాయం 16,35,213



నెల్లూరు,ఏప్రిల్27,ప్రభాతవార్త నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలో వేంచేసియున్న శ్రీ వేదగిరి నరసింహస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ గురువారం నాడు దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ ఆర్‌కె చైతన్య ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది.నాలుగు నెలలకు గాను హుండీ ఆదాయం 16,35,213రూపాయలు వచ్చిందని ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలోధర్మకర్తల మండలి సభ్యులు అల్లూరు దినేష్‌కుమార్,నెట్టం రఘురామయ్య,పామూరు మల్లికార్జునరెడ్డి,రాపురు అంజయ్య,మడపాకుల జయమ్మ,సుంకర మస్తానమ్మ,వినుకోటి ప్రసన్నలక్ష్మీ,ఇండ్ల లక్ష్మమ్మ,రిటైడ్ బ్యాంక్ సిబ్బంది దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## కోనేరు జీర్ణోద్దరణ పనులజాప్యంతో తప్పని తాగునీటి కష్టాలు



**బిట్రగుంట,ఏప్రేల్27,ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయ దిగువభాగానవున్న కోనేరు జీర్ణోద్దరణ పనులు మందకొడిగ సాగుతుండడంతో ప్రజలు త్రాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కోనేటి జీర్ణోద్దరణ పనులు రాష్ట్రంలో వై.సి.పి అదికారంలోకి రావడంతో 2019వ సంవత్సరంలో రాష్ట్ర జలవనరులశాఖామంత్రి అనిల్‌కుమార్ యాదవ్ శంకుస్తాపన చేశారు. ఆతదుపరి కొంతకాలం కరోనావల్ల పనులు ముందుకు సాగలేదు.ప్రస్తుతంకూడా మందకొడిగా సాగుతుండడంతో మరమ్మత్తులు చేసేచోటనుండే జారుతున్నా మహిళలు త్రాగునీరు తెచ్చుకుంటున్నారు.ఈపనులు జరిగేటపుడు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యామ్నాయంగ వాటర్‌ట్యాంకులద్వారా త్రాగునీటిని సరఫరా చేసే వారు.వాటర్‌ట్యాంకుల యజమానులకు నగదు బకాయి పడడంతో ప్రస్తుతం గ్రామంలో త్రాగునీటి రవాణా ఆగిపోయింది.దీంతో జీర్ణోద్దరణ పనులుచేసే చోటనుండే త్రాగునీరు తెచ్చుకుంటు మహిళలు ఇబ్బంది పడుతున్నారు.ఇప్పటికైనా కావలి ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రజల కష్టాలను గమనించి తాత్కాలికంగ త్రాగునీటిని వాటర్‌ట్యాంకులద్వారా సరఫరాచేయించి యుద్దప్రాతిపదికపై కోనేటి నిర్మాణపు పనులు పూర్తిచేయాల్సిన అవసరం ఎంతైనావుంది.కొండబిట్రగుంట ప్రజలకు త్రాగునీటి ఆదారమైన కోనేటి నిర్మాణపు పనులు జాప్యంలేకుండ పూర్తిచేస్తే ప్రజలకు శాశ్వత పరిష్కారం జరిగే అవకాశంవుంది ఇకనైనా అధికారులు,ప్రజాప్రతినిధులు దీనిపై ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీనేతాజి విద్యార్థుల ప్రతిభ



**వింజమూరు,ఏప్రిల్27ప్రభాతవార్త:** వింజమూరులోని శ్రీనేతాజి వికాస్ సూనియర్‌కాలేజి విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మొదటి సంవత్సరంలో పచ్చవ ప్రహర్ష 457, ఇంటర్ ద్వితియ సంవత్సరంలో బత్తుల చిరంజీవి 980, రెప్పా దివ్యలక్ష్మి 935మార్కులను సాధించారని కళాశాల కరస్పాండెంట్ కె.వి.రత్నం తెలిపారు. ఈ విద్యార్థులను అధ్యాపకబృందం అభినందించారు.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో వివేకానంద విజయదుందుభి



**వింజమూరు,ఏప్రిల్27ప్రభాతవార్త:** ఇంటర్ ఫలితాల్లో శ్రీ వివేకానంద జూనియర్ కాలేజి విద్యార్థులు ప్రతిఏటా లాగే ఈదపా కూడా ఫలితాల్లో విజయదుందుభి మ్రోగించారని కరస్పాండెంట్ మద్దూరు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎన్.వెంకటేశ్వర్లు 464, శ్రీమోక్షశ్రీ 463, డి.నవీన్ 460, డి.యువరాజ్ 460 మార్కులు సాధించి తమ పతిభను చాటారు.సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎస్.నవ్యశ్రీ 989, డి.చార్మి 988, కె.వి.లక్ష్మి980 మార్కులతో విజయం సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల అధ్యాపకబృందం అభినందించారు.

## మానిఫెస్టో లోని హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నదే



**చేజర్ల, ఏప్రిల్27ప్రభాతవార్త:** ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం నాగులవెలటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి పార్టీ హామీలను ఇవ్వడం సహజమన్నారు . అయితే వారి ఐదేళ్ళలో ఇచ్చిన హామీలను నెరవేర్చినవారు భారతదేశ చరిత్రలోనే లేరని జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్న అన్ని అంశాలను నెరవేర్చాడని ఆ ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి 100రోజులు పూర్తయిన సందర్భంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులవెలటూరు సచివాలయం పరిధిలో బిల్లుపాడు, నాగులవెలటూరు గ్రామాల్లో గడపగడపకు పర్యటించారు. నాగులవెలటూరు సచివాలయ పరిధిలో 15లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా రెవెన్యూలో సమస్యల పరిష్కారం కోసం నడుం భిగించిన వ్యక్తి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చుక్కల భూముల సమస్యతో రైతులు ఎన్నో ఏళ్ళుగా ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఈ విషయంలో ఇప్పటికే 80శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని మిగిలిన సమస్యలు కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటివరకు ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 17వేల ఎకరాల చుక్కల భూముల సమస్య పరిష్కారమైందన్నారు. సాదా బైనామా కోసం నూతన జిఒ ను విడుదల చేసి 100సంవత్సరాల తర్వాత రీసర్వే నిర్వహిస్తునా న్నరన్నారు. మహిళలు , వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక కృషి చేస్తున్నా మన్నారు. మహిళలకు చేయూత, ఆసరా పథకాలను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఉపాదికల్పనకోసం కొన్ని కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను పూర్తి స్థాయి లో మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణను చేపట్టామన్నారు. పాఠశాల అభివృద్ధికోసం నూతన విధా నాలు, వైద్యరంగంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు , డిజిటల్ లైబ్రరీ తదితర వ్యవస్థలను తెచ్చి గ్రామ సుపరిపాలనకు నాందిపలికారన్నారు. ఇలాంటి గ్రామ స్వరాజ్యం ద్వారా భావితరాలకు ఎంతో భవిష్యత్తును ఏర్పాటు చేస్తున్నారన్నారు. గడప గడపకు తిరిగి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి అందు బాటులో ఉండడంఎంతో ఆనందాన్ని కల్గిస్తుందన్నారు. ఈ 100రోజుల్లో 48సచివాలయాల్లో 66 గ్రామ పం చాయతీల్లో 200గ్రామాల్లో పర్యటించి 40వేలకు పైగా గృహాల ప్రజలతో స్వయంగా మాట్లాడానన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం వారితో మమేకమై కష్టాల్లో , ఆనందాల్లో పాలుపంచుకునే అవకాశం గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా సాధ్యమైందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ విజయలలిత, తహసిల్దార్ శివకృష్ణయ్య, ఉపతహసిల్దార్ పుట్టాబత్తిన విజయ్, వ్యవసాయాధికారి శశిధర్, సచివాలయ సిబ్బంది , అన్నిశాఖల అధికారులు, ఎంపిపి బాలిరెడ్డి రమాదేవి, జడ్పీటిసి పీర్ల పార్థసారథి , వైసిపి మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు వేలూరు తిరుపతినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సచివాలయ జెఎసి కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ బూదళ్ళ వీరరాఘవరెడ్డి, నాగులవెలటూరు మాజీ సర్పంచ్ దౌపాటి రవీంద్రనాయుడు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**ఉలవపాడు,ఏప్రిల్27,ప్రభాతవార్త** ఉలవపాడు మండలంలోని మన్నేటికోట గ్రామానికి ఎందిన యాదవ యువకుడు గొత్తుల హరిప్రసాద్‌పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని యాదవ జేఏసీవ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.బాధితుడు తీవ్ర గాయాలతో ఒంగోలు ప్రైవుటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు హరిప్రసాద్‌ని యాదవ జేఏసీ బృందం పరామర్శించారు.పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేయాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు.బాధితులకు న్యాయం జరిగకపోతే ఆందోళన కార్యక్రమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.బాధితులు పరామర్శించిన వారిలో ప్రకాశంజిల్లా యాదవ జేఏసీ అధ్యక్షులు చిరుమామిళ్ల గోపి కృష్ణయాదవ్,అపా ఏరావుయాదవ్,బాల గురవయ్య తదితరులు ఉన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన వశిష్ఠ విద్యార్ధులు




**నెల్లూరు,ఏప్రిల్27 ప్రభాతవార్త-విద్య** ఇంటర్ ప్రదమ,ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నగరంలోని స్ధానిక బివి నగర్‌లో గత వశిష్ఠ జూనియర్ కళాశాల విద్యార్ధులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. పలితాల్లో ర్యాంకర్లుగా నిలిచిన విద్యార్ధులకు గురువారం స్ధానిక కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వశిష్ఠ విద్యాసంస్ధల డైరెక్టర్ పి.మధు మాట్లాడుతు ప్రారంబించిన అనతి కాలంలోనే తమ విద్యార్ధులు ఇంటర్‌లో ప్రధమస్ధానం సాధించటం గర్వకారణమన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపిసీ విభాగంలో జి.సాయి నిఖిల 981,ఎం కార్తీక 977 మార్కులు, బైపిసీ విభాగంలో బి.కుసుమ 980మార్కులు, సి.మౌళి942, మణికంఠ 927 మార్కులు సాధించటం జరిగిందన్నారు. అలాగే జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో కె.అశ్విత,బిమానసలు 463 మార్కులు, పి.లిఖిత 460 మార్కులు సాధించాన్నారు. బైపిసీలో శ్రీవాణి 432,ప్రత్యూష422,షేక్.సాజీద 418 మార్కులు సాదించటం అభినందనీయమన్నారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్ధులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏ వార్డులో పర్యటించినా ప్రజల స్పందన అమోఘం



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** కావలి పట్టణంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ఏ వార్డులో పర్యటించినా ప్రజల స్పందన అమోఘంగా వుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 38వ వార్డులో ఎమ్మెల్యే వైసిపి నేతలతో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నుంచి వచ్చిన భాస్కర్, మల్లి, రాఘవలకు వైసిపి కండువలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రతి వార్డులో టిడిపి నుంచి వైసిపిలోకి చేరుతున్నారన్నారు. ఇది మంచి పరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ళ పాలన పట్ల ప్రజల స్పందన బాగా వుందన్నారు. రానున్న ఎన్నికలలో తిరిగి జగనన్న ముఖ్యమంత్రిగా గద్దెనెక్కించేందుకు ప్రజలు సిద్దంగా వున్నారన్నారు. కావలి నియోజకవర్గంలో మళ్లీ వైసిపి ఎమ్మెల్యేగా తనను మూడో సారి ముచ్చటగా గెలిపించేందుకు ప్రజలు ఎంతో ఆసక్తిని కనపరుస్తు న్నారన్నారు. వైసిపి నేతలు అమరా వేదగిరి సుబ్బరాయుడుగుప్తా, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఏగూరి చినపుల్లయ్య, గుడ్లూరి మాల్యాద్రి, కనపర్తి రాజశేఖర్, పరుసు మాల్యాద్రి, గంధం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

## ఏసిబి దాడులకు వణుకుతున్న కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** ఏ నిమిషంలోనైనా ఏసిబి దాడులు జరుగుతాయన్న భయంలో కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వణికిపోతోంది. ఇటీవల ఈ కార్యాలయంలో దొంగ రిజిస్ట్రేషన్ల బాగోతం బట్టబయలు కావడంతో జిల్లాలోనే తీవ్ర సంచలనం సృష్టించి చర్చనీయాంశమైంది. కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసిబి దాడులు జరగడంతో ఇక్కడి అధికారి, సిబ్బంది కూడా భయంతో కాలంగ డుపుతున్నారు. కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల జరిగిన దొంగ రిజిస్ట్రేషన్ల తంతుపై జిల్లా రిజిస్ట్రార్ ఎ.బాలాంజనేయులు విచారణ చేపట్టారు.దాదాపు మూడు గంటలు పైచిలుకు జిల్లా రిజిస్ట్రార్ తనిఖీ తంతు నిర్వహించారు. ప్రైవేట్ వ్యక్తుల, స్టాంప్ రైటర్ల కనుసైగల్లో పెద్దఎత్తున ముడుపుల బాగోతంలో కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తే తప్ప నకిలీలా, దొంగ రిజిస్ట్రేషన్ల బాగోతం బట్టబయలవుతుందని, ముడుపులకు అడ్డుకట్ట వేయాలని కావలి ప్రజలు, రియల్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

## మున్సిపల్ కళాశాల విద్యార్ధులను అభినందించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్27,ప్రభాతవార్త** నెల్లూరు మున్సిపల్ జూనియర్ కళాశాలలో చదివి 2023 ఇంటర్మీడియట్ పరిక్షా ఫలితాల్లో అత్యున్నతమైన ఫలితాలు సాధించిన విద్యార్థినీ,విద్యార్థులను గురువారం కమిషనర్ ఛాంబర్‌లో వికాస్‌మర్మత్ అభినందించారు.మున్సిపల్ జూనియర్ కళాశాలలో అత్యున్నతమైన ఫలితాలు సాధించిన వారి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.సీనియర్ ఇంటర్ ఎంపిసి,బైపిసి విభాగాల్లో ఎస్.కె హమీదాపర్వీన్-981,ఎస్‌కె షీరిన్-979,సాదియ-975, త్రివిక్రమ్-960,మానస్‌కుమార్-955,మార్కులు సాధించగా,జూనియర్ ఇంటర్ ఎంపీసీ,బైపిసిలో హుస్నా తబు సం-436, సుమయ-429,మిస్వామహిన్-421,జోయల్ సునాధ్-419,మార్కులు సాధించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ కమిషనర్ అందించిన సహాయ సహకారాలతో కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా కార్పొరేషన్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రశంసించారు.వారి తల్లిదండ్రులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.కార్పొరేషన్ కళాశాలలో ఇంకా మెరుగైన విద్యనుఅందించే విధంగా చర్యలు చేపడతామని,ఫ్రీ ఎడ్యుకేషన్ అందిస్తున్న కార్పొరేషన్ కళాశాలలో తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పించి ఈ అవకాశాన్ని సది ్వనియోగం చేసుకోవాలని కోరారు.

## వేసవి విపత్తుల్ని ఎదుర్కొనేందుకు రెడ్‌క్రాస్ బృందాలు సిద్దం



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** వేసవి కాలంలో సంభవించే విపత్తుల్ని ఎదుర్కొనేందుకు రెడ్‌క్రాస్ బృందాలు సిద్దంగా వున్నాయని కావలి ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని గురువారం ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇతర ప్రకృతి వైపరీత్యాలతో పోలిస్తే వేసవి కాలంలో సంభవించే మరణాలు ఎక్కువన్నారు. వేసవి సెలవులలో పర్యవేక్షణ లేకుండా సముద్రతీరానికి వెళ్లేందుకు, చెరువులు, గుంటలలో ఈత కొట్టేందుకు పిల్లల్ని అనుమతించకూడదని ఆయన తల్లిదండ్రులను హెచ్చరించారు. అగ్నిమాపకదళాలకు తమ రెడ్‌క్రాస్ వాలంటీర్లు చేదోడువాదోడుగా వుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ మరణాలు సంభవిస్తాయన్నారు. అందుచేత ఎండ తీవ్రతలో వీధులలో తిరగకూడదని ఆయన తెలిపారు.అత్యవసరమైతే గొడుగు కానీ టోపి ధరించి బయటకు రావాలన్నారు. మంచినీరు అధికంగా సేవించాలన్నారు.ప్రతి ఒక్కరు మంచినీటి సీసాను దగ్గర వుంచుకోవాలన్నారు. చలివేంద్ర ప్రారంభ సందర్భంగా అందరికి మజ్జిగ పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ ఇన్‌చార్జ్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడుతూ ఆర్డీవో శీనానాయక్ సూచనల మేరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రెండు చలివేంద్రాలు ప్రారంభించామన్నారు.ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ దాకారపు రవిప్రకాష్, కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, సభ్యులు ఒరుగంటి వెంకటేశ్వర్లు, మొగిలిశెట్టి జమున, బి.ఎస్.ప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ సేవలు చరిత్రలో నిలిచిపోతాయి



**కావలి రూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని అంబేద్కర్ మనుమడు డాక్టర్ భీమ్‌రావు యశ్వంతరావు తెలిపారు. కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామంలో జైభీమ్ నినాదాల హోరులో గురువారం రాత్రి అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.దళిత నేతలు పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## దళితవాడలలో 2 కోట్లతో అభివృద్ధి పనులు



**బిట్రగుంట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** బోగోలు మండలం బోగోలు మేజర్ పంచాయతీలోని ఎస్సీ,ఎస్టీ దళితవాడలలో గత మూడు సంవత్సరాలలో సుమారు రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేపట్టినట్లు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు తెలిపారు. బోగోలు పంచాయతీలోని కప్పరాళ్ళతిప్పలో గురువారం సిమెంటు రోడ్డు నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కప్పరాళ్ళతిప్పలో పది లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసి శిలాఫలకాలకే పరిమితం కాగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బోగోలు పంచాయతీలో 2 కోట్ల రూపాయల మేర పనులు చేపట్టామన్నారు. కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కృషితో దళితవాడలలో రాబోవు ఏడాదిలోగా అభివృద్ధి చేపడతామని ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేకల సుజాత, మండల వైసిపి యువత అధ్యక్షులు మేకల శ్రీనివాసులు, ఎంపిటిసి సభ్యులు ఎ.కె.సుందర్‌రాజ్, బోగోలు సర్పంచ్ పందిపాటి అనిత, పార్టీ సీనియర్ నేతలు టి.పెంచలయ్య, మేకల సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

## బోగోలు తహాశీల్దార్‌గా హేమంత్

**బిట్రగుంట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** బోగోలు మండల తహాశీల్దార్‌గా హేమంత్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న తహాశీల్దార్ లక్ష్మీనారాయణ మనుబోలుకు బదిలీ కాగా ప్రస్తుతం నియమించిన హేమంత్ మర్రిపాడు మండలం నుండి బదిలీపై వచ్చారు.

## పర్యవేక్షణ బాధ్యతల్లో అందరూ భాగస్వాములు కావాలి



**జలదంకి, ఏప్రేల్ 27, ప్రభాతవార్త:** స్తానికి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల అదనపు తరగతుల గదుల నిర్మాణాక్రమంలో విద్యాకమిటి చైర్మన్‌తోపాటు సభ్యులందరు పర్యవేక్షణా భాధ్యతలలో పాలుపంచుకుంటు నిర్ధారిత ప్రమాణాల ప్రకారం పక్కాగా పనులు జరిగేలా చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి పేర్కొన్నారు. నిర్మాణంలో వున్న తరగతి గదులను గతరెండురోజులక్రితం మండలాధ్యక్షుడు గోచిపాతల వెంకటరమణయ్య, పంచాయతీ ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డిలు పరిశీలించారు. ఈసందర్బంగ నాసింకపు పనులపై ఎం.పి.పి గోచిపాతల ఆగ్రహం వ్యక్తంచేయడం విదితమే. దీనిని పురష్కరించుకొని హెచ్.ఎం కిమిటి సమావేశం గురువారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈసమావేశానికి ఎం.ఇ.ఒ శ్రీధర్, విద్యాకమిటి చైర్మన్ దగ్గుమాటి.శ్రీకాంత్‌రెడ్డిలతో పాటు ఇంజనీరింగ్‌అసిస్టెంటు, సభ్యులు హాజయ్యారు. ఈసందర్బంగ పనులు పక్కాగా చేపట్టేందుకు వీలుగ తీర్మానం చేశారు. ఇకనుంచి పనులలో ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా నడుచుకోవాలని హెచ్.ఎం పిలుపునిచ్చారు. ఎం.పి.పి సూచించిన విదంగా ప్రమాణాలు పాటిద్దాం. అందుకు సభ్యులందరు వారంలో ఒకటి, రెండు మార్లు పర్యవేక్షణచేస్తూ తగు సూచనలు సలహాలుయివ్వాల్సి వుందన్నారు. తల్లి, దండ్రులు ఇంకెవరైనా దీనిపై ప్రశ్నించే అధికారంవుంది. కాబట్టి కమిటీ వారు పారదర్శంకంగవుండాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఇక్కడ చదివేది మీబిడ్డలే, పదికాలాలపాటు బిల్డింగ్ మన్నికగా వుంటేనే కదా అందరు సంతసించేది. అలాకాకుండా అవకతవకల నిర్మాణమైనపుడు ప్రతివక్కరు ఏలెత్తిచూపిస్తారు. అంతేకాకుండా ఏదైనా జరగరానిది జరిగితే అపడు వెనుకకు తిరగిచూసుకుంటే ప్రయోజనం వుండదని తెలిపారు. కావున పరాదర్శకత పాటిద్దామని పిలుపునిచ్చరు. ఆరోపణలు వచ్చాయి సరిచేద్దాం అంతేకాని ఏముందిలేనని భాద్యతలు మరిచి లైట్‌తీసుకుంటే కమిటి చైర్మన్‌ను తొలగింపుకు ఎలాంటి సంకోచంవుండదని కరాఖండిగా చెప్పారు. ఎం.ఇ.ఒ శ్రీధర్ మాట్లాడుతు ఇకనుంచి నిర్మాణపనులలో ఎలాంటి ఆరోపణలకు అవకాశం రానీయకుండా దొర్లిన తప్పులు సరిచేసి భాద్యతగా వ్యవహరించాలని అన్నారు. ఈ సమావేశానికి కోఆప్షన్ సభ్యుడు పులిగుంట మధురెడ్డితోపాటు మండలసచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మకూడా హాజరయ్యారు.

## రానున్నది వైసీపీ ప్రభుత్వమే



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** భారతదేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తూ ముందుకు సాగుతున్న ప్రభుత్వం వైసీపీయే అని రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు జగనన్నే నా నమ్మకం కార్యక్రమం సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను పంపినీ చేయడమే కాకుండా ప్రభుత్వం చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై వారికి వివరించారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు షేక్. పర్వీన్, వారునడ సభ్యులు షేక్ రఫీ, షేక్ షరీఫ్, సచివాలయ కన్వీనర్ క్రాంతి తదితరులు ఉన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరులోని టీఎస్సీ ప్రభుత్వ కళాశాలలో బుధవారం విడుదల అయిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి మంచి పేరు తెచ్చారని ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎంపీసీలో ఆర్. ప్రదీప్ 934 మార్కులు, సీఈసీలో ఎంవీ హేమంత్ 883, జూనియర్ ఎంపీసీలో జి. గౌరీ 435, సీఈలో బి. కుమార్ 409 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వీరిని ప్రత్యేకంగా అభినందిస్తుఆ న్నమని, ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తూ రాష్ట్ర స్థాయిలో మారునకలు సాధించేలా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సికింధర్, అధ్యాపకులు ఉన్నారు.

## ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్ఐ

**మర్రిపాడు, ఏప్రిల్27ప్రభాతవార్త:** మర్రిపాడు మండల ఎస్ఐ కాసా శ్రీనివాసులు రెడ్డి జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి నుండి గురువారం ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రీనివాసులురెడ్డి చేసిన సేవలను గుర్తించిన ఎస్పీ ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇటీవల నెల్లూరు-కడప మార్గ మధ్యంలో మర్రిపాడు మండల కేంద్రంలో దగ్గరలో అనారోగ్యకారణంగా ఆసుపత్రికి వెళ్ళి తిరుగు ప్రయాణంలో అకస్మాత్తుగా భార్య ఒడిలోఒడిలోతలవాల్చి చనిపోయిన వ్యక్తికి తానే దగ్గరుండి ఆకుటుంబానికి మనోధైర్యం నింపి అన్ని తానై అంబులెన్స్‌కు తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి తన సేవా దృక్పధాన్ని , మానవత్వాన్ని చాటుకోవడంపై పలువురి ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే. ఇందుకుగాను గురువారం జిల్లా ఎస్పీ ఏర్పాటుచేసిన క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి చేతులమీదుగా ఎఎస్ఐ కాసా శ్రీనివాసులురెడ్డి అవార్డు అందుకోవడంపై పలువురు నెటిజన్లు ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు.

## నూతన సాంకేతిక పద్ధతులపై మరింత అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్దతులపై విద్యార్థులు మరింత అవగాహన చేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఎస్‌కే యూనివర్శిటీ సీఈవో శివశంకర్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి కళాశాలలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎస్‌కే యూనివర్శిటీ సౌజన్యంతో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి సదస్సులను పూర్తిస్థాయిలో అకళింపు చేసుకుని నూతన కంపెనీలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ దినకర్, ఈడీసీ హెడ్ డాక్టర్ పి. చక్రపాణిలు పలు సూచనలు చేశారు.

## జాతీయ స్థాయి క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ప్రతిభ




**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** జయపూర్‌లో ఇటీవల జరిగిన రెండవ జాతీయ స్థాయి స్మాష్ రాకెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్త్రీ , పురుషుల జట్లు జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి 3,4స్థానాలను సాధించి ఆంధ్రప్రదేశ్ పేరు మరింత ఇనుమడింపజేశారని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు డి. నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం ఇరుజట్ల క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ స్మాష్ రాకెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఆవిర్భవించిన ఈ స్మాష్ రాకెట్ పోటీల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్త్రీ, పురుషుల జట్లు మంచి ప్రతిభ కనబరచడం ఇతరులకు స్ఫూర్తిదాయ కమన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కోవూరు క్రీడాకారులకు మంచి పేరు ఉందన్నారు. ఇప్పటికే కోవూరుకు చెందిన అనేకమంది క్రీడాకారులు వివిధ రకాల పోటీల్లో మంచి పేరు సాధించి ఉద్యోగాలు సైతం పొంది ఉన్నారన్నారు. అటువంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి కేవలం చదువే కాకుండా క్రీడల పట్ల కూడా మక్కువ చూపాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్మాష్ రాకెట్ అసోసియేషన్ అధ్యక్షులు దేవిక, కార్యదర్శి సిరాఆజ్ అహ్మద్‌లు పలు సూచనలు చేశారు. అనంతరం క్రీడాకారులను శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రాలతో ఘనంఆ సత్కరించి సన్మానం చేశారు.

## ప్రసన్నకుమార్‌రెడ్డి దాతృత్వం



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని గుమ్మలదిబ్బ గ్రామానికి చెందిన జి., అమర్‌బాబు- సుభాషిణి కుమార్తె ప్రణవి మూడు సంవత్సరాలు. ఈ పాపకు గుండెలో చిల్లు పడడంతో హుటాహుటిన చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. పాప ఆపరేషన్ నిమిత్తం నిధులు అవసరం కాగా ఈ విషయం తెలిసిన ప్రసన్నకుమార్‌రెడ్డి స్పందించిన రూ. 20 వేలను రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి చేతుల మీదుగా అమర్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా వైసీపీ చేనేత విభాగం అధ్యక్షులు పన్నెం సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, శివకుమార్‌రెడ్డి, సాయి, తదితరులు ఉన్నారు.

## తల్లులను కోల్పోయిన చిన్నారులకు ఎన్ఎస్ఆర్ ట్రస్టు వితరణ



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు మండలంలో ఇటీవల ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటిస్తున్న సందర్భంగా కొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను చూసి ఆయన చలించిపోయారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎన్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా 1.45 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లను కోవూరులోని రాధాకృష్ణారెడ్డి అతిథి గృహంలో ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. కొడవలూరు పంచాయతీలోని ఎన్. నానికి రూ. 20 వేలు, ఎన్. గంగాభవానికి 20 వేలు, ఏ. రేణుకకు 20 వేలు, ఏ. తనయ్‌కుమార్‌కు 20 వేలు, ఎస్ జోషితకు 20 వేలు, నిహారికకు 20 వేలు, ఎం. అక్షయకు 25 వేలు, మొత్తం 1.45 లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ల పత్రాలను వారికి అందజేశారు. డీసీఎంస్ చైర్మన్ చైర్మన్ వీరి చలపతిరావు, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, తదితరులు ఉన్నారు.

## మలిదేవి అభివృద్ధిపై పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సెల్ఫీ చాలెంజ్

**బుచ్చి ఏప్రిల్ 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ పరిధిలో టిడిపి కోవూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మలిదేవి అభివృద్ధిపై మరో సెల్ఫీ చాలెంజ్‌కి దిగారు. ఈ సందర్భంగా ఆయన బుచ్చిరెడ్డిపాలెం మలిదేవి బ్రిడ్జి వద్ద సెల్ఫీ తీసుకొని అనంతరం మాట్లాడుతు వైసిపి ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు అయిన మలిదేవిని పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మలిదేవి అభివృద్ధికి 84 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అయితే అనతికాలంలోనే ప్రభుత్వం మారడంతో మరలా వైసిపి ప్రభుత్వం రీ టెండరింగ్ వేసి 93 కోట్ల వరకు పెంచిందని ,ఇంతవరకు కొంతమేర ఎర్త్ వర్కు మాత్రమే జరిగిందని అన్నారు. మలిదేవి కి ఇరువైపు కాంక్రీటుగాని, బ్రిడ్జిల నిర్మాణం గాని చేయలేదని అన్నారు. మలిదేవి కనిగిరి రిజర్వాయర్‌కి, రైతులకు అత్యంత కీలకమైనదని ఆయన తెలిపారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నాలుగు సంవత్సరాల కాలంలో మలిదేవి పని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ఆయన ప్రశ్నించారు. మలిదేవే పూర్తి చేయలేని వారు పెన్నానదిలో కాజ్‌వే ఏలా పూర్తి చేస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, రైతువిభాగం నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య, జిల్లా బిసి విభాగం నాయకులు బత్తల హరికృష్ణా, కావలి వెంకటేశ్వర్లు, దొడ్ల కోదండరామిరెడ్డి, వింజం రామానాయుడు, బిసి నాయకులు బండ్ల కొండయ్య, మైనార్టీనాయకులు ఖాదర్‌భాషా (చోటు), అక్తర్, దుగ్గిశెట్టి హరినాద్, నెల్లూరు దయాకర్‌రెడ్డి, వింజం మహేష్‌నాయుడు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన డాక్టర్ భీమ్‌రావు



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మనువడు డాక్టర్ భీమ్‌రావు యశ్వంత్‌రావు గురువారం కావలి జాతీయ రహదారిపై వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక అంబేద్కర్ పార్కులో మొక్కలు నాటారు. కావలి పట్టణం బుద్ధవిహార్ నుంచి నీలి జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని అరుంధతీయనగర్, ఆదిఆంధ్రనగర్, ఇందిరానగర్, జాతీయ రహదారి, సిరిపురం మీదుగా ఈ బైక్ ర్యాలీ కావలి మండలం చలంచర్ల గ్రామానికి చేరింది. గురువారం రాత్రి చలంచర్ల ఏర్పాటు చేసిన నిలువెత్తు కాంస్య విగ్రహానికి అంబేద్కర్ మనువడు డాక్టర్ భీమ్‌రావు యశ్వంతరావు ఆవిష్కరించారు. ఆయన ముంబాయి నుంచి కావలికి వచ్చారు. కావలి పట్టణంలోని పోలీస్ కమాండెంట్ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. పలు రంగాల్లోని ప్రముఖులు కలిసి సత్కరించారు. జనప్రకాషిణి స్వచ్ఛంద సేవా సంస్థ, బిటిఎ, బిఇఎఫ్, ఆర్‌విడిఎస్, అంబేద్కర్ యూత్ ఫోర్స్, అంబేద్కర్ యూత్, అంబేద్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు.

## అల్లిగుంటపాళెంలో శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల రక్తదాన శిబిరం



**కావలి రూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం అల్లిగుంటపాళెం గ్రామంలో కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం గురువారం ప్రత్యేక సేవా శిబిరంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 18 మంది రక్తదానం చేయగా సుమారు వంద మందికి ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారి పేరూరి సాయితేజ మాట్లాడుతూ అల్లిగుంటపాళెంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక సేవా శిబిరంలో రక్తదానంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పలువురు యువకులు స్వచ్చంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల డైరెక్టర్లు జానకిరామ్, వెంకయ్య, మల్లికార్జునరావు, కొండయ్య, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిలా ఫలకాలకే పరిమితమైన వైసీపీ



**నెల్లూరు ఏప్రిల్ 27, ప్రభాతవార్త-వైద్యం** సొమ్ము ఒకడిది సోకు ఒకడిది అన్న చందాన వైసీపీ నాయకులు గతంలో హయాం తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబునాయుడు నిర్మించిన ఇళ్లకు రంగులు మార్చి ప్రజలను మోసగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం.సుబ్బారావు విమర్శించారు. గురువారం నగరంలోని వేంకటేశ్వరపురంలో ఉన్న ఇళ్ళ వద్ద సుబ్బారావు సెల్ఫీ చాలెంజ్ చేస్తూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి జగన్ కాని ఆయన మంత్రులు, ఎమ్మెల్యే పేదవారికి పక్కా గృహాలను నిర్మించి ఉంటే తక్షణమే సెల్ఫీ చాలెంజ్‌కి రావాలని సవాల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఇళ్ళను వైసీపీ నాలుగేళ్ళ కాలంలో ఎక్కడైనా నిర్మించి పేదలకు అందచేశారని ప్రశ్నించారు. 2866 టిడ్కో ఇళ్లు టీడీపీ హయాంలో పేదల కోసం నిర్మించామని అందుకు సజీవ సాక్ష్యం ఇవేనన్నారు. టీడీపీ నిర్మించిన ఇళ్ళను తమ నిర్మించినామని చెప్పుకుంటూ వైసీపీ నాయకులు పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని మండిపడ్డారు. నిర్మించిన ఇళ్ళను పేదలకు అందించికపోగా, స్మార్ట్ టౌన్‌షిప్ కడతారాని దుయ్యబట్టారు. తిరిగి ఉద్యోగులను, కాంట్రాక్టర్లను మోసం చేస్తారని ఎద్దేవా చేశాడు. ఈ నాలుగేళ్ళలో మీరు కట్టిన ఇళ్ళు ఉంటే అవి ఎక్కడ ఉన్నాయో చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ గణేష్‌కుమార్, ముత్తినేని.రవీంద్రనాయుడు, కేసీ.భాస్కర్, సిద్ధకళ, మన్నార్.స్వామి, వీరమల్లు, చంద్ర, కేసీ.సుధా, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కమనీయంగా సీతారాముల కళ్యాణోత్సవం



**వింజమూరు, ఏప్రిల్27ప్రభాతవార్త:** వింజమూరు మండలం ఊటుకూరు పంచాయతీ పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో సీతారాముల కళ్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఉభయకర్తలు వరికూటి కొండారెడ్డి, మాల్యాది, అనూషా దంపతులుకళ్యాణ తంతును జరిపించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు, పూజాదికాలు జరిపించి స్వామివారిని వరునిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని అలంకరించి వివాహ వేదికవద్దకు చేర్చారు. శాస్త్రోక్తంగా అర్చకులు వివాహ కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. ఈకళ్యాణ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి వారి కళ్యాణాన్ని కనులారా తిలకించారు. ఈకార్యక్రమంలో మద్దూరు చెన్నారెడ్డి, ఎనిమిరెడ్డి మల్లికార్జున, ఎనిమిరెడ్డి కొండలరావు, మద్దూరు చంద్రశేఖర్‌రెడ్డి, గూడపాటి నాగేశ్వరరావు, ఇతర పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య ర్యాంకర్లకు అభినందన



**నెల్లూరు, ఏప్రిల్27 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నగరంలోని స్ధానిక శ్రీచైతన్య విద్యాసంస్ధల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపిసీ విభాగంలో దూలిపాళ యజ్ఞశ్రీ 464మార్కులు, ఓ చరిత 464 మార్కులు, మెహమద్ భాను 464 మార్కులు, కె.వంశీనాద్, అంకు నిత్యశ్రీ, చందలూరి కీర్తన, వై.రవిచరణ్, ఎం.కోమల్యలు 463 మార్కులు సాదించారు. బైపిసీ విభాగంలో తోకల శివ హారిక, లాస్యచౌదరిలు 432 మార్కులు సాధించి సత్తా చాటారు. అలాగ సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసీ విభాగంలో గజ్జల శైలశ్రీ 987 మార్కు సాధించి టాపర్‌గా నిలువగా సన్నబోయిన శ్రీరాం 986మార్కులు సాదించారు. ఎం.సౌమ్య, షేక్.అమీషా, భూపాలం జ్యోత్స్నలు 985మార్కులు సాధించి జయకేతనం ఎగురవేశారు. ఈ సందర్బంగా శ్రీచైతన్య విద్యాసంస్ధల డీన్ జి.శ్రీరాం మాట్లాడుతు తమ విద్యార్థులు జూనియర్, సీనియర్ ఇంటర్‌లో విజయ దుందుబి మోగించటం గర్వంగా ఉందన్నారు. సీనియర్ ఇంటర్‌లో 24మంది విద్యార్థులు 980కుపైగా, 54మంది విద్యార్థులు 970కంటే ఎక్కువ మార్కులు సాధించటం జరిగందన్నారు. అలాగే జూనియర్ ఇంటర్ ఫలితాల్లో26మంది విద్యార్థులు 460కంటే ఎక్కువ మార్కులు, 140మంది విద్యార్థులు 450కంటే ఎక్కువ మార్కులు సాధించి ప్రతిభ కనపరిచారన్నారు. ఇంతటి విజయాలు సాధించేందకు కృసి చేసిన అందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థకలు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిద్దార్ధ విద్యార్దులను అభినందించిన డిఐజి




**బుచ్చి ఏప్రిల్ 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెంలోని సిద్దార్ధ జూనియర్ కాలేజి విద్యార్దులను డిఐజి ఎస్.వి రాజశేఖర్‌బాబు అభినందించారు.ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గోన్న సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి విద్యార్ది లక్ష్యంతో ముందుకు వెళ్ళాలని సూచించారు.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతలాలలో ఉన్న విద్యార్దులు సివిల్స్‌లో టాపర్లుగా నిలిచారని ఆయన తెలిపారు.బుచ్చిరెడ్డిపాళెం లాంటి చిన్న పట్టణంలో సిద్దార్ద కాలేజి విద్యార్దులు కార్పోరేటు కళశాలలకన్న ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు.సిద్దార్ద కాలేజి కేవలం బాలికల క్యాంపస్ కావడం కళాశాల యాజమాన్యం విద్యార్దినుల పట్ల చూపిస్తున శ్రద్ద అద్భుతమని అన్నారు.ప్రతి విద్యార్ది ఉన్నతచదువులు చదవాలి ఉన్నతమైన ఉద్యోగాలలో స్దిరపడాలని ఆయన విద్యార్దులకు మార్గదర్శకం చేశారు.డిజిఐ తన స్వంత విషయాన్ని ప్రస్తావించారు.తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్దాయికి వచ్చానని తెలిపారు. ప్రభుత్వం ప్రస్తుతం విద్యారంగంపైన ప్రత్యేక దృష్టి పెట్టిందని ఇది చాలా అభినందనీయమని ఆయన ప్రశంసించారు.ఈ సందర్బంగా విద్యార్దులందర్ని అభినందించి వారికి మెమోంటోలు అందజేశారు.ఈకార్యక్రమంలో ముఖ్య అతిదులుగా కళాశాల ప్రిన్సిఫల్ ఎస్. విద్యాసాగర్, పిడి భీమతాటి వెంకటరమణయ్య, రామకృష్ణా,చిట్టిబాబు,దినకరబాబు విద్యార్దులకు మార్గదర్శకం చేశారు.అనంతరం డిఐజిని,అతిధులను మెమోంటోలు ఇచ్చి సత్కరించారు.ఈకార్యక్రమంలో సిద్దార్ధ కళశాల అద్యాపక బృందం ,రైన్‌బో స్కూల్ అద్యాపక బృందం, తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## ప్రాథమిక స్థాయి నుంచి క్రీడలపై మక్కువ చూపాలి



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ చూపాలని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు డి. నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాలికల బాక్సింగ్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు 12 పతకాలను సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కూడా క్రీడల పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ పోటీలు కూడా నిర్వహించి గ్రామీణ క్రీడలకు పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు బాక్సింగ్ పోటీలో అత్యంత ప్రతిభ నసబరిచి 12 పతకాలు సాధించి జిల్లా స్థాయిలో కోవూరుకు మంచిపేరు తెచ్చారన్నారు. ఈ సందర్భంగా వారి దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పీఈటీ వెంకటసుబ్బమ్మ, ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తిలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో కూడా మంచి పతకాలు తెచ్చేలా విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. ఈ పాఠశాలకు తమ తల్లి పచ్చిపాల రామనాథమ్మ పేరు మీద ప్రభుత్వానికి 10 లక్షల మేర డిపాజిట్ చేశామని, త్వరలో ఈ పాఠశాలకు రామనాథమ్మ పేరు వస్తుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రస్థాయిలో ఈ పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చేలా తమ ట్రస్టు కృషి చేస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ దేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంపీడీవో శ్రీహరి, జెడ్పీటీసీ శ్రీలతలు ప్రసంగించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు మెడల్స్, సర్టిఫికేట్లను అందజేశారు.

## పెంచలకోన బ్రహోత్సవాలకు ఆహ్వానం



**నెల్లూరు సిటీ,ఏప్రిల్27,ప్రభాతవార్త** మే1వ తేదీ నుండి 7వ తేదీ వరకు పెంచలకోన బ్రహోత్స వాలు జరగనున్నాయని భక్తులందరూ హజరై స్వామివారిని దర్శించుకుని తరించాలని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానం పలికారు.నెల్లూరు డైకాస్ రోడ్డులోని కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ బ్రహోత్స వాలకు అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేస్తున్నామన్నారు.ఇప్పటికే సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించామని భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించామని తెలిపారు.కోవిడ్ పెరుగుతున్న దృష్ట్యా నియమనిబంధనలు పాటించేలా భక్తులకు సూచిస్తున్నామన్నారు.భక్తులకు భోజన వసతి సదుపాయాలలో లోటుపాట్లు లేకుండా పెరుగుతున్న ఎండలకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామ న్నారు.వైభవంగా నిర్వహిస్తున్న పెంచలకోన బ్రహోత్స వాలకు ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డిని స్వయంగా ఆహ్వానించామని తెలిపారు.అదేవిధంగా మంత్రి అంబటి రాంబాబు,టిటిడి చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి,బాలినేని శ్రీనివాసులురెడ్డి తదితర ఎంపీలు,ఎమ్మెల్యేలను ఆహ్వానించామన్నారు.అదేవిధంగా వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధిపై సమన్వయకర్తగా దృష్టి సారించామన్నారు.కలువాయి ట్యాంక్,రిజర్వాయర్ పనులను పాత కాంట్రాక్టర్లు రద్దు చేసుకున్నారని కొత్త టెండర్లను ఆహ్వానించేందుకు చర్యలు చేపడుతున్నామ న్నారు .వెంకటగిరిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుకు అంగీకరించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ధన్య వాదాలు తెలిపారు.పార్టీ అధిష్టానం ఆదేశాలతో అందరి సలహాలు,సూచనలతో ప్రజలకు సంక్షేమపథకాలు అందించేందుకు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన కృష్ణచైతన్య విద్యార్దులు



**నెల్లూరు,ఏప్రిల్27 ప్రభాతవార్త–విద్య** ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నగరంలోని స్థానిక కృష్ణచైతన్య జూనియర్ కళాశాల విద్యార్దులు అత్యంత ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో సనా ఫాతీమా 470 మార్కులకు గానూ 465 మార్కులు సాదించి ప్రథమస్థానాన్ని కైవశం చేసుకుంది. అలాగే నిఖిల 463 మార్కులు, మునిధరణ్ 462, సాధించారు. సీనియర్ ఇంటర్ విభాగంలో సువర్ణ 1000 మర్కులకు గానూ 987 మార్కులు సాదించి టాపర్‌గా నిలువగా దేవిసాయి సుష్మిత 986 మార్కులు, ఖాధర్ మస్తాన్, రుతికలు 985 మార్కులు, మానసలు 984 మార్కులు సాధించి సత్తా చాటారు. ఈ సందర్బంగా స్దానిక కళాశాలలో రాక్యంకులు సాధించిన విద్యార్దులకు అభినంద కార్యక్రమాన్ని నిర్వహించారు.కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వి.కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు ఈ సందర్బంగామాట్లాడుతు తమ విద్యార్దులు జూనియర్, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ప్రదమంగా నిలువటం అభినందనీయమన్నారు. కేవలం నెలూరు నగరానికే పరిమితమైన తమ విద్యాసంస్థల విద్యార్దులు రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలువటం గర వ్యకారణమన్నారు. జూనియర్ ఇంటర్‌లో 10మందికి పైగా విద్యార్దులు 460మార్కులు సాధించారని, 42మంది విదా ర్యర్దులు 450కంటే ఎక్కువ మార్కులు సాదిం చారన్నారు. సీనియర్ ఇంటర్‌లో 11మంది విద్యార్దులు 980 పైగా మార్కులు కైవశం చేసుకోవటం జరిగిందని, మరో 51మంది విద్యార్దులు 970 కంటే ఎక్కువ మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. పటిష్టమైన విద్యాప్రణాళికతో ,ఒత్తిడి లేని విద్యను అందించటం తో ఇంతటి విజయాలు సాదించటం జరిగిందన్నారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్దులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల నూతన డైరెక్టర్ పర్వతరెడ్డిరానా ప్రమోద్‌రెడ్డి, జూనియర్ కళాశాలల డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రాం గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికంగా ముందుండాలి

**నెల్లూరు ఏప్రిల్ 27, ప్రభాతవార్త–వైద్యం** పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సాంకేతికతను తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు అందిపుచ్చుకోవాలని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఐటీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటిగ్రేటెడ్ డిజిటల్ శిక్షణ కార్యక్రమానికి కోటంరెడ్డి ముఖ్యఅ తిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీఎస్‌తోపాటు టీడీపీ ఆధ్వర్యంలో ఉన్న యాప్స్ నిర్వహణ మొదలైన వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సూచించారు. నెల్లూరు పార్లమెంటు ఆర్టీఎస్ ట్రైనర్ గొట్టిపాటి.మనోరమ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి యాప్‌లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. సోషల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు టెక్నాలజీతో హౌస్ మ్యాపింగ్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్యకర్తలు, ముఖ్యనేతలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీడీపీ అధ్యక్షుడు రసూల్, నగర అధ్యక్షుడు మామిడాల.మధు, మాజీ కార్పొరేటర్లు పిట్టి.సత్యనాగేశ్వరరావు, కువ్వారపు.బాలాజీ, ఉచ్చి.భువనేశ్వరప్రసాద్, కప్పిర.శ్రీనివాసులు, మల్లిఖార్జున, జాఫర్‌షరీఫ్, జహీర్, ప్రశాంత్, ఖాదర్‌బాషా, పొత్తూరి.శైలజ, మహేందర్‌రెడ్డి, మొయినుద్దీన్, శ్రీదేవి, సుశీలమ్మ, కొమారి.విజయ కస్లర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## "ఎస్ఆర్" కళాశాల ర్యాంకర్లకు అభినందన




**నెల్లూరు,ఏప్రిల్27 ప్రభాతవార్త–విద్య** ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి ర్యాంకర్లుగా నిలిచిన ఎస్ఆర్ కళాశాల విద్యార్థులకు గురువారం నగరంలోని స్థానిక కళాశాలలో యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్బంగా ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మ న్ ఎనగందుల వరదారెడ్డి,డైరెక్టర్స్ మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలు మాట్లాడుతు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి అత్యుత్తమ ఫలితాలను సాధించిన ఘనత తమ విద్యాసంస్థలకే దక్కుతుందన్నారు.జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో కె.తేజరెడ్డి, జి.మానసలు 464మార్కులు సాధించటం జరిగిందని, అలాగే బైపీసీ విభాగంలో కూడా తమ విద్యార్థిని వై.నిత్య434 మార్కులు సాధించి సత్తా చాటిందన్నారు. అనంతరం రాయలసీమ డిజిఎం మాదిరెడ్డి సమ్మిరెడ్డి ఒత్తిడి లేని విద్యను అత్యాధునిక సాంకేతికను వినియోగించి నిష్ఠాతులైన అధ్యాపకులచే బోధించటం ద్వారా ఇంతటి విజయాలు సాధించ గలిగామన్నారు.తాము స్థాపించిన నాటి నుంటే ప్రధమర్యాంకులు సాధించటం గర్వకారణమని రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించేందుకు కృషిచేస్తామన్నారు.అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్దులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. డీన్ కృష్ణారెడ్డి, ఎజిఎం రణధీర్‌రెడ్డి, ప్రిని సపాల్ అమరేందర్‌రెడ్డి, సిబ్బంది జయప్రకాశ్, కిరణ్‌కుమకార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌తో సుధారాణి భేటి



**నెల్లూరు ఏప్రిల్ 27, ప్రభాతవార్త–వైద్యం** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తడకపల్లి.సుధారాణి గురువారం మంత్రాలయంలో మంత్రాలయం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సుబుదేంద్రతీర్థులు వారి మఠంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా.లోకేష్‌ను మర్యాదపూర్వకంగా ఆమె కలిశారు. ఈ సందర్భంగా సుధారాణి ఆయన మాట్లాడుతూ వారు బ్రాహ్మణ కార్పొరేషన్‌ను చట్టబద్ధత చేయాలని, బ్రాహ్మణుల కొరకు గతంలో ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాడ్డాక బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు నిధులను కేటాయించాలని ఆమె కోరారు. వాటిపై సానుకూలంగా లోకేష్ సానుకూలంగా స్పందించారని ఆమె పేర్కొన్నారు. త్వరలోనే కృష్ణాజిల్లాలో బ్రాహ్మణులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు దానికి తనను ఆహ్వానించడం జరిగిం దన్నారు.

## విజిలెన్స్ ఎంక్వైరీ జరగాలి



**నెల్లూరుక్రైమ్,ఏప్రేల్27 ,ప్రభాతవార్తః** నెల్లూరులోని షాదీ మంజిల్ బుకింగ్ డబ్బులు వసూలుచేసిన విషయంపై సమగ్రవి చారణ జరిపించాలని నెల్లూరు పార్లమెంట్ టి.డి.పి అధికారప్రతినిది షాబీర్‌ఖాన్ విజి లెన్స్ డి.ఎస్.పిని ఆయన కార్యాలయంలో కలసి ఫిర్యాదుచేశారు.ఈసందర్బంగా షాబీర్‌ఖాన్ మాట్లాడుతు కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి నగరం లోని కోట మిట్టలో వున్నటువంటి షాదీమంజిల్ బుకింగ్ వ్యవహారానికి సంబందించి కార్పో రేషన్ అదికారులకు సంబందంలేకుండ కొందమంది డబ్బులు వసూలుచేస్తున్నారని అటువంటి వారిపై సమగ్ర విచారణ జరిపి వారికి శిక్షపడేలా చేయాలని అదికారులను కోరినట్లు తెలిపారు.షాదీమంజిల్‌వ్యవహారం పూర్తి గ కార్పొరేషన్ అదికారులకు మాత్రమేలోబడి వుంటుందని స్పష్టంచేశారు.ఈవసూలు వ్యవహారంపై ఎవరె వరు వున్నారు ,వసూలుచేసిన నగదుఎవరెవరి చేతులు మారాయో అదికారులు విచారణలో నిజాలు వెలుగులోకి వస్తాయని ధీమా వ్యక్తంచేశారు.రాష్ట్ర మైనారిటిసెల్ నాయకులు,టి.డి.పి మద్ద తుదారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ,గ్రామాన వైద్యసేవలే లక్ష్యం...కాకర్ల



**వరికుంటపాడు,ఏప్రేల్27 ,ప్రభాతవార్తః** అత్యంత వెనుక బడినప్రాంతం స్వంత నియోజకవర్గమైన ఉదయగిరి నియోజకవ ర్గంలో గ్రామ ,గ్రామాన ప్రతి కు టుంబానికి ఉచిత వైద్యసేవలు అందించడమే తన లక్ష్యమని కాకర్ల చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ అన్నారు.గురువారం మం డలపరిధిలోని ఎర్రంరె డ్డిపల్లి గ్రామంలో కాకర్ల ట్రస్ట్ ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన సంజీవిని ఆరోగ్యరథంను వేదమంత్రోశ్చరణలమద్య పూజలు నిర్వహించి జండావూపి ప్రారంభించారు.ఈసందర్బంగ కాకర్ల మాట్లాడుతు తనస్వంత గ్రామమైన ఎర్రంరెడ్డిపల్లినుండి ఆరోగ్యరధాన్ని ప్రారంబించడం చాలా అనందంగవుందని మాతృభూమి రుణంతీర్చుకునేందుకు అవకాశం రావడం ఎంతో ఆనందదాయకమని అన్నారు.మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్తాపకులు నందమూరి తారకరామారావులను ఆదర్శంగ తీసుకొని నారా లోకేష్ అడుగుజాడల్లో నడిచేందుకు నదుంబిగించానన్నారు.రాష్ట్రంలో ఇప్పటివరకు మూడు సంజీవని ఆరోగ్యరదాలు వుండగనారా లోకేష్ సమన్వయంతో నాల్గవది తాను ఏర్పాటుచేయడం ఎంతో ఆనందంగా వుందన్నారు.ఉదయగిరి నియో జకవర్గంలోని 8మండలాల ప్రజలకు నాలుగునెలల వ్యవదిలోనే ఈఆరోగ్యరథంద్వారా విశిష్టమైన సేవలు అందించేందుకు అలాగే మెరుగైన వైద్యసేవలకోసం హెల్త్ కార్డులు అందించడంతోపాటు కోర్పొరేట్ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించేల సహకారం అందిస్తామని తెలిపారు.ఇప్పటికే నియోజకవర్గంలో అన్నా క్యాంటిన్‌ద్వారా ఐదురూపాయలకే 500మందికి రుచి,సుచికరమైన భోదనాలు అందిస్తున్నామని రైతన్నలకు పవర్‌స్ప్రే యర్లు,యువతకు క్రీడాపోటీలు,ఉచిత నైపుణ్యాశిక్షణా కోర్సులు,నిరుపేద వర్తకులకు తోపుడుబండ్లు పంపిణీచేసి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కాకర్ల ట్రస్ట్ కృషిచేస్తుందని ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ అన్నారు.తెలుగుదేశం నేతలు దుద్దుకూరు వెంకటరత్నం,సందిరెడ్డి మాలకొండయ్య,నాదెండ్ల రంగారావు,నాదెండ్ల రంగనాయకులు,ఎర్రగుంట్ల చెన్నకృష్ణయ్య,రాయవరపు మాలకొండారావు,చంద్ర ఉమామహేశ్వరరావు,పేరం సుధాకర్‌రెడ్డి,రావెళ్ళ మల్లికార్జున,తదితరులు పాల్గొన్నారు.

## విశ్వతేజ విద్యార్దుల విజయకేతనం



**వరికుంటపాడు,ఏప్రేల్27,ప్రభాతవార్తః** ఇంటర్ పరీక్షాఫలితాలలో విశ్వతే జా వి ద్యార్దులు అత్యుత్తమ ఫలితాలు సా దించారని కళాశాల కరస్పాం డెంట్ దొం తురెడ్డి వాసుదేవారెడ్డి తెలిపారు. ద్వితీ యసంవత్సరం ఎం.పి.సినందు ఎన్.షి రీష 952మార్కులతో మండల ప్రధ మస్తానం సాధించిందని,ఎన్.మౌనిక 942మార్కులతోమండలస్థాయి ద్వితీ య స్తానం సాదించిందన్నా రు.అలాగే ప్రథమసంవత్సరంనందు ఎస్.అఖిల 429మార్కులు,ఎస్.డి షమీద్ 424మార్కులు,ఎస్.కె హారీఫ్422 మార్కులు,పి.మహాలక్ష్మి 422 మార్కులు సాధించి మండలస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపా రని,ప్రథమ సంవత్సరం 95శాతం,ద్వితీయ సంవత్సరం97శాతంఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ తెలి పారు.ఒకేషనల్ ఇంటర్ ద్వితీయ సంవ త్సరం యూస్సీ 937 మార్కులు,సుగుణ 934,వినోద్ 925 ప్రథమ సంవత్సరం నందు చాందిని 474 మార్కులు సాదించి మెట్టప్రాంతంలో అత్యుత్తమ ఫలితాలు సాదించారని వారిని కళాశాల యాజమాన్యం అభినందించారు.

## విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలన్నదే శ్రీ వశిష్ట ధ్యేయం



**కావలి రూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** కావలి పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఉన్నత విద్య అందించాలన్నదే శ్రీ వశిష్ట జూనియర్ కళాశాల ధ్యేయమని కళాశాల డైరెక్టర్ కోట సురేంద్రరెడ్డి తెలిపారు. ఇంటర్ పరీక్షా ఫలితాలలో కావలి పుల్లారెడ్డినగర్‌లోని శ్రీ వశిష్ట జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి కావలి పట్టణంలో టాపర్‌గా నిలవడంతో కళాశాలలో గురువారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోట సురేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ మహ్మద్ అల్తాఫ్‌లు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎస్.మేఘన 987/1000 మార్కులు సాధించి టౌన్ సెకండ్‌లో నిలిచిందన్నారు. పి.లక్ష్మిశ్రావణి 987 మార్కులు, బైపిసి విభాగంలో జిలోకహితైషి 983 మార్కులు, ఎంఇసి విభాగంలో కె.మహేంద్రరెడ్డి 972 మార్కులు, సిఇసి విభాగంలో జి.శ్రావణి 967 మార్కులు దక్కించుకున్నారన్నారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో యం.డి.మహితలక్ష్మి నిషిద 465/470 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ సాధించిందని తెలిపారు. ఎ.వి.ఎస్.మహితశ్రీ 464, పి.సాయిచరిత 464, పి.హర్షిత్‌కుమార్ 464, సి.హెచ్.లిఖిత 463 మార్కులు దక్కించుకున్నారన్నారు. జి.జిగ్నేష్ 462 మార్కులు, పి.శ్రీనవ్య 461, షేక్ సానియా కౌసర్ 460, కె.మానస 460 మార్కులు సాధించారన్నారు. బైపిసి విభాగంలో టి.తేజస్వని 429 మార్కులు, ఎస్.కె.దనీషా 460 మార్కులు, ఎంఇసి విభాగంలో సి.చరణ్‌ప్రీతి 449 మార్కులు, సిఇసి విభాగంలో టి.లక్ష్మి 398 మార్కులు సాధించి అందరి ప్రశంసలు పొందారన్నారు. ఈ కళాశాల స్థాపించి నాలుగు సంవత్సరాలైందన్నారు. మొదటి రెండు సంవత్సరాలు కరోన అని తెలిపారు. గత సంవత్సరం ఉత్తమ ఫలితాలు రాబట్టడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం జెఇఇ మెయిన్స్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రాబోయే సంవత్సరంలో ఇంతకంటే మంచి మార్కులు సాధించడం శ్రీ వశిష్ట కర్తవ్యమన్నారు. ఇంతటి ఘన విజయం సాధించేందుకు కృషి చేసిన విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థినులు బాగా చదివి ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలి



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** విద్యార్థినులు బాగా చదివి అన్ని రంగాలలో రాణించేలా ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని దేశాభివృద్ధికి పాటుపడాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కు మార్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని యన్.యశ్విత సీనియర్ ఇంటర్‌లో 1000/989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో కావలి బావుటాను ఎగురవేసింది. గురువారం ఈ విద్యార్థినిని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దుశ్శాలువాతో సత్కరించి పూలబొకె అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడి పది మందికి సేవ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.లుకోధర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని అత్యధిక మార్కులతో ప్రతిభను చాటిచెప్పారన్నారు. పి.దీప్తి 983/1000, ఇ.మేరిజోన్స్983, ఎ.లక్ష్మిప్రసన్న 981, ఎన్.వి.యన్.సునీల్‌కుమార్ 981, బైపిసి విభాగంలో టి.విష్ణుసూర్యప్రకాష్ 971, కె.వెంకటసుశ్రిత 970, పి.అహ్మద్ ఖాన్ 967, సిఇసి విభాగంలో ఎస్.సౌజన్య 954, ఐ.ఎన్.వి.అనుషిత 855, ఎ.దివ్య 885 మార్కులు సాధించారన్నారు. హెచ్ఇసి విభాగంలో ఐ.సాహితమాల 904, జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఇ.పూర్ణసన్నిసాయి 463, ఎస్.కె.అఫ్తాబ్ అహ్మద్ 456,బి.లక్ష్మిగణేష్ 456, ఎస్.కె.మౌసినా 452, బైపిసి విభాగంలో కె.ప్రణీత్‌రాజ్‌వర్ధన్ 422 , కె.నాగసాయిమల్లిక 419, ఎస్.కె.సఖియా కౌసర్ 414, సిఇసి విభాగంలో నాగేశ్వరి 400, సి.హెచ్.నవ్య 394,యం.డి.ఆశ్రియా 358 మార్కులతో పట్టణంలో విజయదుందుభి మోగించారన్నారు. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**సైదాపురం ఏప్రిల్ 27 ప్రభాతవార్త** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొని వచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేనని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డవలప్మెంట్ చైర్మన్, తిరుపతి వైసిపి జిల్లా అధ్యక్షులు, వెంక టగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గులించర్ల గ్రామ సచివాలయం పరిధిలో గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గోన్నారు.ఈ సందర్బంగా ప్రతి ఇంటికి తిరుగుతు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తు బుక్‌లేట్‌ను లబ్ధిదారులకు అందించారు.ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నృత్య కళా సంగీత అకాడమి చైర్మన్ పొట్టేళ్ళ శిరీషా , ఎంపిడిఒ మీసాల వెంకటేశ్వర్లు,తహసిల్దారు విజయలక్ష్మీ పార్టీసీనియర్‌నాయకులు దాసరిరాజు. శంకరరాజు,ప్రభాకర్‌రెడ్డి,చెమిర్తి జనార్దన్‌రాజు,రాంగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, శేషయ్యనాయుడు, శివకుమార్, సురేష్ బాబు, సుబ్బారెడ్డి,బాస్కర్‌రావు, తదితర నాయకులు మండల అధికారులు పాల్గోన్నారు.

## అక్రమమద్యం,గంజాయి అమ్మితే చర్యలు



**సైదాపురం ఏప్రిల్ 27 ప్రభాతవార్త** ఎవ్వరైనా అక్రమ మద్యం గంజాయి ,నాటు సారా,అమ్మితే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పొదలకూరు సెబ్ ఇనస్పెక్టర్ బి.వెంకట్రావ్ హెచ్చరించారు. సైదాపురం పరిధిలో అనుమానం కలిగిన ప్రదేశాలను దుకాణాలను గురువారం సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం తనీఖిలు చేయడం జరిగిందని తెలిపారు.మండలంలో ఎవ్వరైనా ఇతర రాష్ట్రాల నుండి మద్యం సారాయి,గంజాయి తీసుకొని వచ్చి అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ముఖ్యమంగా గ్రామాలలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆయన వెంట విజయ్‌బాబు,సిబ్బంది ఉన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో "విశ్వసాయి" జయకేతనం




నెల్లూరు,ఏప్రిల్27 ప్రభాతవార్త–విద్య రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బోత్స సత్య నారాయన విడుదల చేసిన ఇంటర్ ప్రదమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నగరంలోని స్దానిక విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్దులు ప్రతిభ కనపరిచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎన్.అంజన 464మార్కులు , జి.నవీన్ కుమార్,రుషితరెడ్డి, ఎం.వేద విశ్విత,ఎం విష్ణువర్ధన్‌లు 463మార్కులు కైవశం చేసుకుని సత్తా చాటారు. బైపీసీ విభాగంలో పి.దివ్య, ఎం.సాయి హర్షితలు 435 మార్కులు సాధించారు. అలాగే ఎం.యశ్వంత్‌కుమాం,షేక్ మెహబీన,ఎస్ దీక్షిత, డి.అస్మితలు 434 మార్కులు సాదించారు. ఎంఈసీలో ఎండి గుఫ్రాన్ 489మార్కులు, టి.విష్ణు 485 మార్కులు సాదించి సత్తా చాటారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిపీ విభాగంలో ఎన్.సుమంత్ 987 మార్కులు, వి.శివజ్యోతి, కె.శ్రీ సాయి యశశ్విలు 986 మార్కులు సాధించారు. వై.మోనీషా, ఎన్.శశిర్‌రెడ్డి పి.తనుశ్రీలు 985 మార్కులు సాదించారు. బైపీసీ విభాగంలో బి.రాహుల్‌ఈశ్వర్, ఆర్ సుష్మ,పివి.నాగ యశశ్విని లు 987 మార్కులు కైవశం చేసుకోగా డి.జాహ్నవి 986 మార్కులు సాధించింది. ఎంఈసీ లో ఇవి.రుష్మిత 953మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ సందర్బంగా స్దానిక కళాశాలలో ర్యాంకర్లను విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ఉత్తమ మైన విద్యను ఒత్తిడి లేకుండా విద్యార్దులకు సులభ తరంగా అందించటం ద్వారా ఇంతటి ఘనవిజయాలు సాధించ గలిగామని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్దులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.